క్లుప్తంగా

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



పెదనందిపాడు: ప్రతి ఒక్కరూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల గురించి తెలుసుకోవాలని వాటి గురించి తెలుసుకొని వాటిని వినియోగించుకోవాలని ఏఓ సుధారాణి అన్నారు. శనివారం మండల పరిధిలోని నాగులపాడు సచివాలయంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఓ సంధ్యారాణి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలైన జలజీవన్ మిషన్, పీఎం ఆవాస్ యోజన, పీఎం ఉజ్వల్ యోజన, ఆయుష్మాన్ భారత్, పోషణ అభియాన్, దీన్‌దయాళ్ అంత్యోదయ, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, పీఎం జన్‌ధన్ యోజన, స్వామిత్వ, పలు పథకాల గురించి ప్రజలకు వివరించారు. వాటికి ఎలా దరఖాస్తు చేసుకోవాలో అవగాహన కల్పించారు. జిల్లా కో–ఆర్డినేటర్ ప్రసాద్, వైద్యాధికారి విజయరత్నకుమార్, సర్పంచ్ పి.శ్రీలక్ష్మి, కార్యదర్శి నాగయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి, సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపుగా వాడుకోవాలి



పెదనందిపాడు: ప్రతి ఒక్కరూ విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని, అవసరం ఉన్నంత మేరకే వినియోగించుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ బి.వీరాంజనేయులు అన్నారు. శనివారం స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో సబ్ స్టేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న వీరాంజనేయులు మాట్లాడుతూ ప్రస్తుతం బొగ్గు కొరత ఉందని, సరైన సమయంలో వర్షాలు పడక పోవడంతో అప్పుడప్పుడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని ఆయన చెప్పారు. ఇప్పటివరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడలేదని, రాబోయే రోజుల్లో కూడా అంతరాయం ఏర్పడకుండా చూస్తామని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ విద్యుత్ ఆదా చేయటానికి తమ వంతు కృషి చేయాలని ఆయన చెప్పారు. ఎంపీపీ టి.హెప్సిబా, కమిటీ సభ్యులు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో చేరిన పలువురు అంగన్‌వాడీ ఆయాలు, టీచర్లు

తాడికొండ: మండలంలో పలువురు అంగన్‌వాడీ ఆయాలు, టీచర్లు సమ్మె విరమించి విధుల్లోకి చేరారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం త్వరలో జీతాలు పెంపుపై ప్రకటన చేస్తామని, అప్పటి వరకు విధుల్లో చేరాలని సూచించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో టీచర్లు, ఆయాలు సమ్మె విరమించి విధుల్లో చేరుతున్నట్లు సంబంధిత స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో సమాచారం అందించారు. ఇప్పటికే నాలుగు మండలాల్లో పలువురు విధుల్లో చేరారు. యూనియన్ల నుంచి ఒత్తిడి ఎదురవుతున్న నేపథ్యంలో బహిర్గతం కాకుండా విధుల్లో పాల్గొంటున్నారని ఐసీడీఎస్ అధికారులు తెలిపారు.

స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



మంగళగిరి: రానున్న రోజుల్లో ఏ ప్రభుత్వం ఏర్పాటైనా స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్ తెలిపారు. పట్టణంలోని సంఘం కార్యాలయంలో శనివారం స్వర్ణకారులకు రెండు వేయింగ్ మిషన్లు, 35 మందికి పనిముట్లు, 100 గోడ గడియారాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ స్వర్ణకారులకు కార్పొరేషన్ నిధులు అందకపోవడం వల్ల అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకుని కుటీర పరిశ్రమలు నడుపుతూ నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే కార్పొరేషన్ ఏర్పాటు చేసి, నిధులు కేటాయించి స్వర్ణకార పరిశ్రమను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కొల్లి గిరి, జింక దివ్య నారాయణ, ధనాలకోటి వాసు, యు. నాగేంద్రకుమార్, మండ్రు సత్యనారాయణ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మంగళగిరి: నగర పరిధిలోని పెదవడ్లపూడి కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైంది. కాలువలో గుర్తు తెలియని సుమారు 40 సంవత్సరాల వయస్సున్న వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గమనించి పోలీసులుకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న వారు మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేశానికే గర్వకారణం అంబేడ్కర్ విగ్రహం

ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోశయ్య

పొన్నూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు విజయవాడ నడిబొడ్డున రూ.404 కోట్లతో 206 అడుగుల ఎత్తులో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చేయడం దేశానికే గర్వకారణమని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా అంబేడ్కర్‌ను గౌరవించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. శనివారం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే రోశయ్య మాట్లాడారు. దళితుల్లో ఎవరైనా పుట్టాలనుకుంటారా అని ఎస్సీలను చులకనగా మాట్లాడిన చంద్రబాబుకు, కింది స్థాయి నాయకుడైన ధూళిపాళ్ల నరేంద్రకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి లేదన్నారు. గత ఎన్నికలలో ఓట్ల కోసం అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చి చంద్రబాబు మోసం చేశాడని విమర్శించారు. పొన్నూరు నియోజకవర్గంలో 50 సంవత్సరాల చరిత్ర ఉందని చెప్పుకునే దూళిపాళ్ల ఎస్సీ, ఎస్టీ మైనార్టీ వర్గాలకు ఏం చేశాడో చెప్పాలన్నారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ బోర్డు డైరెక్టర్ దాసరి నారాయణరావు, వ్యవసాయ మండల సభ్యుడు బొద్దులూరి రంగారావు, వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పెరికల కృష్ణమోహన్, పట్టణ, రూరల్ అధ్యక్షులు ఎంఎ మహమూద్, రుద్రపాటి ఆదిశేషులు, నాయకులు కోటా శ్రీనివాసరావు, షేక్ మాము, జేసీఎస్ కన్వీనర్ అమిరినేని సాంబశివరావు, షేక్ సుభాని పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి సమష్టి కృషి

- జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు, ఎంపీపీ ఇంటూరి పద్మావతి
- రూరల్ మండలం సర్వసభ్య సమావేశం



సమావేశంలో పాల్గొన్న జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు, ఎంపీపీ ఇంటూరి పద్మావతి తదితరులు

గుంటూరు రూరల్: సమష్టిగా మండలాభివృద్ధికి కృషిచేద్దామని రూరల్ మండలం జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు, ఎంపీపీ ఇంటూరి పద్మావతిలు తెలిపారు. శనివారం నగరంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ మండల పరిధిలో రైతులకు అవసరమైన డొంకలు, రోడ్ల మరమ్మతుల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అదేవిధంగా రానున్న కాలంలో ప్రజల తాగునీరు వసతుల కల్పనకు అధికారులు కృషిచేయాలని సూచించారు. అనంతరం ఎంపీపీ గత రెండేళ్లలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను అధికారులతో సమీక్షించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో పనులు జరుగుతూ ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. వైస్ ఎంపీపీ దర్శి సుజాత, ఎంపీటీసీలు కె.రమేష్, కో–ఆప్షన్ సభ్యుడు కరిముల్లా, ఎంపీడీఓ ఆదినారాయణ, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన

నగర కమిషనర్ కీర్తి చేకూరి



అధికారులతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల కు అనుగుణంగా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను ఈ నెల 25 నాటికి పూర్తి చేయాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్‌ఓ కీర్తి చేకూరి ఆయా డిపార్ట్‌మెంట్ అధికారులకు స్పష్టం చేశారు. శనివారం క్యాంప్ కార్యాలయంలో అదనపు కమిషనర్, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్, విద్యాశాఖ అధికారులతో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను ఈ నెల 25 నాటికి పూర్తి చేయాలన్నారు. నగరంలోని ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ప్ర భుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఉన్నాయని, వాటిలో పోలింగ్ నిర్వహణకు అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటుపై విద్యా శాఖ, నగరపాలక సంస్థ అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో వృద్ధులు, దివ్యాంగులకు వీలుగా ర్యాంప్‌లు, టాయ్‌లెట్స్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేస్తున్న మౌలిక వసతుల ఏర్పాటుపై ఎస్‌ఈతో కలిసి ఏఈఆర్‌ఓ, ఎన్నికల డెప్యూటీ తహసీల్దార్లు పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పశ్చిమ నియోజకవర్గ ఈఆర్‌ఓ, అదనపు కమిషనర్ కె.లక్ష్మీ శివజ్యోతి, ఎస్‌ఈ (ఎఫ్ఏసీ) సుందరరామిరెడ్డి, ఈఈలు కొండారెడ్డి, శ్రీనివాస్, అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ విజయలక్ష్మి ఎంఈఓలు నాగేంద్రమ్మ, జ్యోతికిరణ్, డిప్యూటీ తహసీల్దార్లు బి.భాస్కర్, మల్లేశ్వరరావు, డీఈఈలు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో విద్యార్థుల సత్తా



గుంటూరు ఎడ్యుకేషన్: చదువులో ప్రతిభావంతులుగా రాణిస్తున్న విద్యార్థులు క్రీడల్లోనూ సత్తా చాటుతున్నారని టీజేపీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏబీపీ మనోహర్ తెలిపారు. శనివారం పట్టాభిపురంలోని కళాశాలలో జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో మనోహర్ మాట్లాడుతూ డిగ్రీ, పీజీ విద్యార్థులు క్రీడా రంగంలో రాణించడం అభినందనీయమన్నారు. ఒక వైపు కుటుంబ పోషణకు పనిచేస్తూ, మరో వైపు క్రీడా పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా భారతీయ జనతా మహిళా మోర్చా జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రెండు కిలోమీటర్ల పరుగు పందెంలో బీఎస్సీ ప్రథమ సంవత్సర విద్యార్థి వి.ఈశ్వర్‌లాల్ నాయక్, ఎం.కామ్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని బి.సత్యారాణి ప్రథమ స్థానంలో నిలిచి, బహుమతులు గెలుపొందినట్లు తెలిపారు. కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం మాట్లాడుతూ ప్రతిభకు పేదరికం అడ్డుకాదని, తమ విద్యార్థులు నిరూపించారని తెలిపారు. వ్యాయామ అధ్యాపకుడు ఆర్.శివాజీ, డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

ఏపీ గిరిజన పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యవర్గం



గౌరవ అధ్యక్షుడు కృష్ణానాయక్‌కు నియామక పత్రం అందజేస్తున్న కట్టా వెంకటేశ్వర్లు

నెహ్రూనగర్: ఆంధ్రప్రదేశ్ గిరిజన పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యవర్గం శనివారం ఎన్నుకున్నారు. స్థానిక రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించిన సమావేశానికి సమితి రాష్ట్ర అధ్యక్షుడు కట్టా వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. సమితి గౌరవ అధ్యక్షులుగా రామావత్ కృష్ణానాయక్, కార్యనిర్వాహక అధ్యక్షులుగా కుందనాటి సంజయ్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా కాండ్రకొండ కోటయ్య, ఉపాధ్యక్షులుగా అమాస్ రాములు, సెక్రటరీగా తోకల నరసింహారావు, బడె నాగరాజు, ధారవత్ సాంబశివనాయక్, సంయుక్త కార్యదర్శి కేతావత్ బాలునాయక్, కుంభా కుమారస్వామి, ఆర్గనైజింగ్ కార్యదర్శి కొండారెడ్డి శ్రీనివాస్, పసుపులేటి వరప్రసాద్, కావాడి శ్రీనివాసరావు, కోశాధికారిగా పోట్లూరి మోహన్‌రావులను ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనుల మధ్య ఐక్యత పెంపొందించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై గిరిజనులకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో యువకుడు, యువతి అదృశ్యం

తాడేపల్లి రూరల్: వేర్వేరు ప్రాంతాల్లో యువకుడు, యువతి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. యస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం... డోలాస్‌నగర్‌కు చెందిన జ్యోతి పెద్ద కుమారుడైన వేల్పుల రవితేజ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 16న స్నేహితులైన బత్తుల రాజేష్, సతీష్‌లతో కలసి ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లి తిరిగి రాలేదు. స్నేహితుల్ని అడిగితే తమకు తెలియదని చెబుతున్నారని, తన కుమారుడు ఎక్కడున్నాడో వారిద్దరికీ తెలుసని జ్యోతి ఫిర్యాదు చేసింది. నులకపేటకు చెందిన కుమారి తన కుమార్తె ప్రగతి ఈనెల 19వ తేదీ కిరాణా కొట్టుకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని, అదే ప్రాంతంలో నివాసముండే రాము అనే యువకుడు కిడ్నాప్ చేసినట్లు అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. రెండు సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు యస్ఐ రమేష్ తెలిపారు.

నేడు కాకుమానులో వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభం

కాకుమాను: మండల కేంద్రం కాకుమాను ప్రధాన కూడలిలో ఆదివారం వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభించనున్నట్లు వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభించే కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయ కర్త బలసాని కిరణ్‌కుమార్ పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం గ్రామంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

30, 31వ తేదీల్లో స్ఫూర్తి ది ఐ క్యూబ్ ఎక్స్‌పో

గుంటూరు ఎడ్యుకేషన్: హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఈనెల 30, 31వ తేదీల్లో స్ఫూర్తి ది ఐ క్యూబ్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ తెలిపారు. శనివారం అమరావతిరోడ్డులోని కళాశాలలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎస్వీ రమణ మాట్లాడుతూ విద్యార్థులను పరిశ్రమల అవసరాలకు దీటుగా తయారు చేసేందుకు పరిశ్రమలు, విద్యాసంస్థలను అనుసంధానం చేయడమే ముఖ్య ఉద్దేశంగా రెండు రోజుల పాటు ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు వివరించారు. గుంటూరు నగరంలోని వివిధ డిగ్రీ కళాశాలలు, ప్రముఖ ఆస్పత్రులతో పాటు ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని వివరించారు. ఎక్స్‌పోలో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన ఆయా సంస్థలు ఈనెల 23వ తేదీ సాయంత్రం లోపు 7013876153 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. స్ఫూర్తి కన్వీనర్ డాక్టర్ వి.చక్రవర్తి మాట్లాడుతూ రెండురోజులపాటు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రదర్శన జరగనున్నట్లు తెలిపారు. ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె.లలిత, సహాయాచార్యులు డి.కళ్యాణి, సీహెచ్ వైష్ణవి, వి.బాలాజీ, సీహెచ్ వేదవతి, ఎ.బాజీబాబు, వి.అభిలాష్, డాక్టర్ గోపి శ్రీనివాసరావు, ఎన్.మణికంఠ, బి.అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణతో నెరవేరిన సీఎం జగన్ సంకల్పం

వైఎస్సార్ ఇంటిలెక్చ్యువల్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.శాంతమూర్తి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచంలోనే అతి పెద్దదైన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని విజయవాడ నగరం నడిబొడ్డున ఏర్పాటు చేయడం ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక సమతా సంకల్పాన్ని నెరవేర్చారని అవర్ స్టేట్ అవర్ లీడర్ – వైఎస్సార్ ఇంటిలెక్చ్యువల్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.శాంతమూర్తి పేర్కొన్నారు. శనివారం అమరావతిరోడ్డులోని ఫోరం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చారిత్రక ఘట్టమని, చరిత్రలో మరపురాని రోజుగా నిలిచిపోతుందన్నారు.

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిక మెజార్టీతో ఘనవిజయం సాధించడం రాష్ట్ర ప్రజలకు ఎంతో అవసరమన్నారు. సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగించేందుకు మరోసారి వైఎస్సార్ సీపీ విజయం చారిత్రక అవసరమన్నారు. ప్రభుత్వ పథకాలు గురించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అపోహలను తొలగించడంలో అందరూ కృషి చేయాలని తెలిపారు. సమావేశంలో జీడీసీసీ బ్యాంక్ జనరల్ మేనేజర్ అజయ్ కిషోర్, ఇండియన్ బ్యాంకు సీనియర్ మేనేజర్ శ్రీనివాసు, వెంకటరమణారెడ్డి, డి.తిరుపతిరెడ్డి, పి.గౌరీ శిరీష, ఫణిదీపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కన్న కొడుకుని చూసి తిరిగొస్తుండగా మృత్యువాత

తాడికొండ: ఇద్దరు ఆడపిల్లల తర్వాత కొడుకు పుట్టాడన్న సంతోషంతో ఓ తండ్రి ఆగమేఘాల మీద అత్తారింటికి వెళ్లాడు. పొత్తిళ్లలోని ముక్కు పచ్చరాలని కొడుకుని చూసి తిరిగి వస్తుండగా, మృత్యువు దారి కాచి రోడ్డు ప్రమాదం రూపంలో కబళించింది. పచ్చని సంసారంలో చిచ్చు పెట్టింది. ఈ విషాద ఘటన శనివారం తుళ్లూరు మండలం సీడ్ యాక్సిస్ రోడ్డుపై శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదకూరపాడు మండలం హుస్సేన్ నగరానికి చెందిన జెట్టి రాజేష్ (30) రాయపూడి గ్రామానికి చెందిన మహిళతో 10 సంవత్సరాల కిందట వివాహమైంది. గతంలో వారికి ఇద్దరు కుమార్తెలు ఉండగా, నెల రోజుల కిందట కుమారుడు పుట్టాడు. అతడ్ని చూసి వచ్చి వెళుతూ, మార్గం మధ్యంలో రాయపూడి– దొండపాడు మధ్య సీడ్ యాక్సిస్ రోడ్డు పక్కనున్న ఇనుప పైపులను ఢీకొని మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు సీఐ ఆనందరావు తెలిపారు.

పంచాయతీలకు నిధుల జమపై సీఎంకు ధన్యవాదాలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పాపారావు

పాత గుంటూరు: రాష్ట్రవ్యాప్తంగా 2022 –23 ఆర్థిక సంఘం నిధులు రూ.415 కోట్లను గ్రామ పంచాయతీ ఖాతాలకు జమ చేసిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు ధన్యవాదాలు తెలిపారు. శనివారం అరండల్‌పేటలోని సంఘ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని గ్రామపంచాయతీలకు రూ.41 కోట్లు విడుదల చేశారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి సర్పంచులకు హెల్త్ కార్డులు, ప్రమాద బీమా రూ.20 లక్షలు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఆర్థిక సంఘం నిధులు కూడా మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని అన్నారు. సమావేశంలో అఖిలభారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, సంఘ జిల్లా అధ్యక్షులు ముప్పాళ్ళ మనోహర్, సర్పంచులు సూర్య ప్రకాష్, ఎస్.లలిత కుమారి, మబ్బు శిరీష, తోకల సరోజినీ, ఏరువా జగన్ మోహన్ రెడ్డి, వెదురుపాక వెంకట్, చుండు వెంకట రెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం, శారీరక దారుఢ్యం

- ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు
- ముగిసిన ఆడుదాం ఆంధ్రా మండలస్థాయి పోటీలు



వాలీబాల్‌లో ప్రథమస్థానంలో నిలిచిన జట్టుకు మెమొంటో అందజేస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు



వెంగళాయపాలెంలో కోచ్‌లను సన్మానిస్తున్న ఎంపీపీ ఇంటూరి పద్మావతి, ఎంపీడీఓ ఆదినారాయణ

కాకుమాను: నేటి విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి చూపి పోటీలలో రాణించాలని ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు శనివారంతో ముగిశాయి. ఈసందర్భంగా ఎంపీపీ శ్రీనివారావు మాట్లాడుతూ ప్రస్తుతం తల్లిదండ్రులు విద్యార్థులను కేవలం విద్యకే పరిమితం చేస్తున్నారని విద్యతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి చూపేవిధంగా ప్రోత్సహించాలని సూచించారు. జడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం మాట్లాడుతూ క్రీడల వలన ఆరోగ్యంతో పాటు శారీరక దారుఢ్యం పెంపొందుతుందని ఆమె తెలిపారు. ప్రతి రోజు ఒక గంట సమయం ఆటలకు కేటాంచుకోవాలని ఆమె సూచించారు. ఈసందర్భంగా మండల స్థాయిలో నిర్వహించిన వివిధ రకాల ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు షీల్డ్‌లు, మెమెంటోలు అందజేశారు. గ్రామ సర్పంచ్‌లు శివకుమారి, రాంబాబు, ఎంపీటీసీ కానుగుల పరమేశ్వరరావు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు వింతా రాఘవరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు తియ్యగూర వెంకటరెడ్డి, ఎంపీటీసీలు నెప్పల సౌజన్య, మువ్వ శివయ్య, ఎంపీడీఓ రామకృష్ణ, తహసీల్దార్ జె.ప్రసాదరావు, పీఈటీలు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

వాలీ బాల్‌లో కాకుమాను, కబడ్డీ, క్రికెట్‌లో కొమ్మూరు జట్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. ప్రథమ స్థానంలో నిలిచిన జట్లు త్వరలో ప్రత్తిపాడులో నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి పోటీలలో పాల్గొంటారని ఎంపీడీఓ తెలిపారు.

క్రీడల ద్వారా ఆరోగ్యం పదిలం : ఎంపీపీ పద్మావతి

గుంటూరు రూరల్: గ్రామీణ క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తును అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా ఆడుదాం ఆంధ్రా అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని రూరల్ మండలం ఎంపీపీ ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి తెలిపారు. శనివారం మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడల ముగింపు వేడుకలు వెంగళాయపాలెం గ్రామం కైలాసగిరి రోడ్డులోని మైదానంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ క్రీడల ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందని, మానసిక ప్రశాంతత, శారీరక ధృడత్వం కలుగుతుందన్నారు. గెలుపు ఓటములు సహజమని ప్రతి క్రీడాకారుడు తమ క్రీడల్లోని నైపుణ్యాతలను మెరుగు పరుచుకోవాలన్నారు. అనంతరం పది రోజులపాటు క్రీడలను నిర్వహించిన కోచ్‌లను, పర్యవేక్షకులను ఘనంగా శాలువాలు కప్పి, మెమొంటోలు ఇచ్చి, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆదినారాయణ సర్పంచ్‌లు, సచివాలయం సిబ్బంది తదితరులున్నారు.

గుంటూరు డివిజన్ మీదుగా అయోధ్యకు ప్రత్యేక రైలు

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ ప్రయాణికుల సౌకర్యార్థం అయోధ్యకు ప్రత్యేక రైలును కేటాయించినట్లు డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నంబర్ 07215 గుంటూరు– అయోధ్యధమ్ ప్రత్యేక రైలు ఈనెల 31వ తేదీన గుంటూరు రైల్వే స్టేషన్ నుంచి మధ్యాహ్నం ఒంటి గంటకు బయలు దేరుతుందని తెలిపారు. అలాగే ఇదే రైలు ఫిబ్రవరి 3వ తేదీ సాయంత్రం 5.45 గంటలకు అయోధ్య ధమ్ స్టేషన్ నుంచి గుంటూరుకు బయలు దేరుతుందని తెలిపారు.

రైళ్ల స్టాప్‌లు పొడిగింపు..

దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ ప్రయాణికుల సౌకర్యార్థం కేటాయించిన ప్రత్యేక స్టాప్‌లను మరో ఆరు నెలలు పొడిగిస్తున్నట్లు సీనియర్ డీసీయం దినేష్‌కుమార్ తెలిపారు. రైలు నంబర్ 17243, గుంటూరు– రాయగడ రైలు భీమడోలు స్టేషన్ మీదుగా, 17281 గుంటూరు–నరసాపూర్ రైలు పుట్లచెరువు మీదుగా, 12603 చెన్నై సెంట్రల్– హైదరాబాద్ రైలు నడికుడి, సత్తెనపల్లి, పిడుగురాళ్ళ, మిర్యాలగూడ, నల్గొండ మీదుగా, 12733 తిరుపతి– లింగంపల్లి రైలు నడికుడి, పిడుగురాళ్ల, మిర్యాలగూడ మీదుగా, 17015 భువనేశ్వర్– సికింద్రబాద్ రైలు సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ మీదుగా, 17232 నాగర్‌సోల్– నరసాపూర్ రైలు సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ మీదుగా, 17625 కాచిగూడ–రేపల్లె రైలు వేజెండ్ల మీదుగా, 17216 ధర్మవరం–విజయవాడ రైలు గిద్దలూరు మీదుగా, 17256 లింగంపల్లి–నరసాపూర్ రైలు మంగళగిరి మీదుగా, 17643 చంగల్‌పట్టు– కాకినాడ పోర్ట్ రైలు మంగళగిరి స్టేషన్ మీదుగా, 17216 ధర్మవరం–విజయవాడ రైలు మాల్కాపురం రోడ్డు మీదుగా, 17255 నరసాపూర్– హైదరాబాద్ రైలు నల్గొండ స్టేషన్ మీదుగా, 17643 చంగల్‌పట్టు– కాకినాడ పోర్టు రైలు న్యూ గుంటూరు స్టేషన్ మీదుగా, 17212 యశ్వంత్‌పూర్– మచిలీపట్నం రైలు కంభం స్టేషన్ మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు.

సాంప్రదాయ సంగీతం అభివృద్ధికి కృషి



యువ పురస్కారంతో సత్కారం

నగరంపాలెం: సాంప్రదాయ సంగీతం అభివృద్ధికి నిరంతర కృషి చేయడం అభినందనీయమని న్యాయవాది జూపూడి వెంకటకుమార్‌యజ్ఞదత్ అన్నారు. గాయత్రీ మహిళా సంగీత సమ్మండలి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం బృందావన్‌గార్డెన్స్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలోని అన్నమయ్య కళావేదికపై సంగీత సభ జరిగింది. విశ్రాంత లెక్చరర్ తులశమ్మ, వైద్యురాలు జి.నీలిమజ్యోతి జ్యోతి ప్రకాశనంతో సభను ప్రారంభించగా, డాక్టర్ పి.విజయ సభాధ్యక్షత వహించి మాట్లాడారు. ముఖ్యఅతిథి వెంకటకుమార్‌యజ్ఞదత్ మాట్లాడుతూ యువతను సంస్థ ప్రోత్సహించడం గొప్ప విషయమని అన్నారు. అనంతరం విదుషి వ్యాకరణం గాయత్రీ విభావరికి గాయత్రీ యువ సంగీత రత్న బిరుదు– యువ పురస్కారంతో సత్కరించారు. వ్యాకరణం గాయత్రీ విభావరి వాయులీన సోలో శాస్త్రీయ సంగీత కచేరి నిర్వహించగా, మృదంగంపై విద్వాన్ ఎస్.హరిహరన్ (చెన్నై) చక్కటి వాయిద్యాన్ని అందించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి ఎంవై శేషురాణి, ఉపాధ్యక్షురాలు పాటిబండ్ల లలిత, మాధవపెద్ది విజయలక్ష్మి, కార్యదర్శి ఎ. మంగాదేవి, ఉప కార్యదర్శి మాధవీకృష్ణ పాల్గొనగా, అతిథులు, కళాకారులను సత్కరించారు.

పాస్‌పోర్ట్ పోయినది

నా పేరు అలవాల శిరీష D/o అంజిరెడ్డి, నేను వల్లూరు గ్రామం, కాకుమాను మండలం, గుంటూరు జిల్లా నివాసిని. ది.20-01-2024 రోజున వల్లూరు నుండి కాకుమాను ఆటోలో వస్తూఉండగా నా ఇండియన్ పాస్‌పోర్ట్ నెం.V0505965(ఒరిజినల్) పోయినది. ఎవరికయినా దొరికిన యెడల నా అడ్రస్సుకు సంప్రదించగలరు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, ఉపనయన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ప్రత్తిపాడు డివిజన్
90109 57733 (ప్రత్తిపాడు)
90109 62225 (పొన్నూరు)
Office mail : sakshigntadvt@gmail.com